ప్రభుత్వ బడిలో ప్రవేశాలు డీలా

- ఇంగ్లిష్ మీడియం తొలగిస్తారనే భయం
- నంద్యాల అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 113 పాఠశాలలు
- గతేడాది కంటే 1,175 మందికి పైగా విద్యార్థుల తగ్గుదల
- ఆంగ్ల మాధ్యమంపై గతంలో చంద్రబాబు అక్కసు
- అధికారంలోకి రావడంతో కొనసాగింపుపై అనుమానాలు



నంద్యాల పట్టణంలోని మునిసిపల్ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

నంద్యాల(అర్బన్): కార్పొరేట్ స్థాయి విద్యాబోధన, సౌకర్యాలతో వైఎస్ జగన్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడేవి. ప్రతి ఏటా ప్రవేశాలు పెరిగేవి. తాజాగా వచ్చిన కూటమి ప్రభుత్వం సర్కారు బడుల్లో ఇంగ్లిష్ మీడియం తొలగించి కేవలం తెలుగు మీడియం మాత్రమే అమలుచేస్తారనే ప్రచారం కొనసాగుతోంది. దీంతో ఈ విద్యా సంవత్సరం సర్కారీ బడుల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మీడియం ప్రవేశపెట్టడాన్ని గతంలో వ్యతిరేకించడంతో పాటు ఉపాధ్యాయ సంఘాలు కూడా తెలుగు మీడియం అమలు చేయాలని పట్టుబట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ఉంటుందా.. లేదా.. అనే సందిగ్ధంలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు. దీంతో వారి పిల్లలను ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వంలో విద్యా విప్లవం తీసుకొచ్చారు. పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించేలా అమ్మఒడి అందించడంతో పాటు ఇంగ్లిష్ మీడియం విద్యను చేరువ చేశారు. అలాగే నాడు-నేడు కార్యక్రమం కింద కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దారు. విద్యాకానుక, డిజిటల్ విద్యాబోధన, ట్యాబ్‌ల పంపిణీ వంటి వినూత్న కార్యక్రమాలతో పిల్లలను బడి బాట పట్టించారు. మారుమూల గ్రామాల్లోని హైస్కూళ్లను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్ విద్యాబోధనను బాలికలకు చేరువ చేశారు. దీంతో పదో తరగతి తర్వాత చదువుకు స్వస్తి చెప్పిన వేలాది మంది బాలికలు ఇంటర్ విద్యను అభ్యసించారు.

ప్రభుత్వ బడికి దూరమైన 1175 మంది

నంద్యాల అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 113 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రస్తుతం సుమారు 14,978 మంది విద్యనభ్యసిస్తున్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో 16,153 మంది విద్యార్థులు ఉండగా దాదాపు 1175 మంది విద్యార్థులు ప్రభుత్వ బడులకు దూరమయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని కొనసాగిస్తారా.. లేదా అనే దానిపై స్పష్టత లేకపోవడంతోనే ప్రవేశాలు తగ్గడానికి ఒక కారణమని విద్యావంతులు, విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై ఎంఈఓ బ్రహ్మంనాయక్‌ను వివరణ కోరగా తల్లిదండ్రుల వ్యక్తిగత కారణాలతో ప్రభుత్వ బడుల్లో చేరికలు తగ్గాయన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు చేరే విధంగా వారి తల్లిదండ్రుల్లో చైతన్యం తెచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఇంగ్లిష్ మీడియం దూరం చేయొద్దు



ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన దూరమవుతుందనే కారణంతోనే తల్లిదండ్రులు వాటిలో చేర్పించడం లేదు. చాలా మంది ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులను పంపుతున్నారు. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం కచ్చితంగా ఉంటుందని ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధిస్తామన్న భరోసాను ఉపాధ్యాయులు కల్పించాలి.

–హుసేన్‌వలి, కానాల, నంద్యాల

గత ప్రభుత్వంలాగా ప్రోత్సహించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశం పెరగడానికి గత ప్రభుత్వం ప్రోత్సహించేది. అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15 వేలు అందించింది. క్రమం తప్పకుండా యూనిఫాం, పుస్తకాలు, నోటుబుక్కులు, బ్యాగ్ తదితర వస్తువులతో కూడిన కిట్లు అందించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం అమలు చేయాలి. దీని వల్ల బడుల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.

–రవి, నంద్యాల

క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని నిరుపేద వైశ్య కుటుంబాలకు వైశ్య సహాయ వారధి ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వేణుగోపాల్, సెక్రటరీ రమేష్ మాట్లాడుతూ వైశ్య సహాయ వారధి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకొని 5వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిరుపేదలకు, అదే విధంగా నిరుపేద విద్యార్థులకు చదువు కోసం ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. ప్రతి ఏడాది తమవంతు సాయంగా మరిన్ని సేవలు అందజేస్తామని వారు అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు హరీఫ్, సత్య, మణికంఠ, సుధీర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మంచిగా మెలగండి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న దృశ్యం

రుద్రవరం: సమాజంలో అందరితో మంచిగా మెలగాలని ఏఎస్‌ఐలు భూపాల్ రెడ్డి, శోభన బాబు,బాలన్న రౌడీ షీటర్లు, బైండోవర్ కేసులున్న వారికి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద వారు ఆదివారం రౌడీషీటర్లకు, బైండోవర్ కేసులన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. గొడవల జోలికి వెళ్ల వద్దని, అలాగే తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు.

సత్తెమ్మకు బోనాల సమర్పణ



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని కోటకందుకూరు గ్రామానికి వెళ్లే దారిలో వెలసిన సత్తెమ్మ అమ్మ వారికి ఆదివారం పట్టణ వాసులు ఘనంగా బోనాలు సమర్పించారు. వర్షాలు కురిసి పంటలు బాగుండాలని కోరుతూ గండాదీపం మోస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

విస్తరిస్తున్న కంది సాగు



క్రిష్టిపాడులో సాగుచేస్తున్న కంది

దొర్నిపాడు: మార్కెట్లో గత రెండేళ్ల నుంచి కందిపప్పుకు డిమాండ్ పెరగడంతో రైతులు కందిసాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం వర్షాలు సాగుకు అనుకూలంగా కురవడంతో రైతులు కందిపంట సాగుకు శ్రీకారం చుట్టారు. గతేడాది మండలంలో 182 హెక్టార్లలో పంట వేయగా ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుడులు వచ్చాయి. అలాగే ధర కూడా క్వింటాకు రూ.10వేల వరకు ఉండేది. తక్కువ పెట్టుబడి, ఒక నీటి తడి పెడితే చాలు పంట చేతికి వస్తుంది. దీంతో మండల రైతులు ఈ పంటసాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ సారి గతేడాది సాగుకు రెట్టింపు కావొచ్చని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లా జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నందమూరినగర్ రాయల్స్ హోమ్ క్రీడా మైదానంలో ఆదివారం పురుషులు, మహిళల బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక జరిగింది. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈపోటీలను ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గౌరవాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్, మండల విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, గోపాల్‌రెడ్డి, దండె నాగరాజు, శివరామిరెడ్డి ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 1, 2, 3 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడా భారతి ఆధ్వర్యంలో నంద్యాలలో రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీలు నిర్వహించి క్రీడాకారులకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాయామ టీచర్లు పాల్గొన్నారు.

చారుమజుందరుకు నివాళి

నంద్యాల(న్యూటౌన్): నక్సల్‌బరి సృష్టికర్త చారుమజుందరు వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రవిరాజ్ మాట్లాడుతూ అమరజీవుల ఆశయ సాధనకై ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. కార్పొరేట్ పాలకులకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్య పరచాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వైద్య సదస్సు



రాష్ట్ర స్థాయి వైద్యసదస్సులో వైద్యులకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ మణిదీప్

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో మధుమణి నర్సింగ్‌హోం ఈఎన్‌టీ వైద్యులు మధుసూదన రావు, మణిదీప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సల వైద్య శిబిరం, రాష్ట్రస్థాయి వైద్య సదస్సు ఆదివారం సాయంత్రానికి ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మధుసూదనరావు మాట్లాడుతూ ఈ ఉచిత శిబిరంలో మొత్తం 110 మందికి శస్త్ర చికిత్సలు, 1000 మందికి ఓపీడీలో ఉచితంగా చూడటం జరిగిందన్నారు. అవసరమైన వారికి ఉచిత మందులు అందజేశామన్నారు. రూ.50లక్షల విలువైన వైద్యసేవలు నిరుపేదలకు అందించడం జరిగిందన్నారు. రాష్ట్రస్థాయి సదస్సులో 200 మందికి పైగా ఈఎన్‌టీ వైద్యులు శిక్షణ పొందడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైద్యులు రోహిత్, విజయేంద్ర, వినయ్, విద్యాసాగర్, శ్రీపతినాయుడు, రవికృష్ణ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే పీడీ యాక్ట్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

బొమ్మలసత్రం: రౌడీషీటర్లు, సస్పెక్ట్ రౌడీషీటర్లు శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే పీడీయాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామని డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్లలో పోలీస్ అధికారులు ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ గతంలో నేరాలకు పాల్పడి ప్రజలకు ఇబ్బందులు కలిగించే 17 మందిని పీడీయాక్ట్ నమోదు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. రౌడీషీటర్లు ప్రజలను భయాందోళనకు గురిచేయకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు రాజారెడ్డి, నరసింహులు, దస్తగిరిబాబు తదితరులు ఉన్నారు.

తాగు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

- న్యాయ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్



కమిషనర్‌తో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల(సిటీ): పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆదివారం పట్టణ శివారులోని చెరువు కట్ట ప్రాంతాన్ని ఆయన మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. పెరుగుతున్న జనాభాకు అవసరమైన మేరకు నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న ఎస్ఎస్ ట్యాంక్‌తో పాటు అదనంగా మరో ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఈఈ మధు కుమార్ తదితరులున్నారు.

తరిమెల నాగిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేద్దాం



చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన విప్లవ యోధుడు తరిమెల నాగిరెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి ఎం.శంకర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో తరిమెల నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడై బెనర్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి ఆంధ్రుడు అని అన్నారు. భూస్వామ్య వ్యవస్థను భూస్థాపితం చేసి దోపిడీ లేని సమాజ స్థాపనకై సర్వం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి నాగిరెడ్డి అని అన్నారు. 1952లో అనంతపురం అసెంబ్లీ నియోజవకర్గంలో నీలం సంజీవరెడ్డిపై 12 వేల మెజార్టీతో గెలుపొందారన్నారు. కార్యక్రమంలో నాయకులు చౌడప్ప, యాకూబ్, కలాం, పఠాన్, తదితరులు పాల్గొన్నారు.

మాన్యం భూముల కౌలు వేలం లేనట్లే !



పేరూరు ఈశ్వర రామాంజనేయ స్వామి ఆలయం,



బీళ్లుగా మారిన స్వామి మాన్యం భూములు

రుద్రవరం: మండల పరిధిలోని పేరూరు ఈశ్వర, వీరభద్ర, రామాంజనేయ స్వామి వారి మాన్యం భూములకు దేవదాయ శాఖ అధికారులు నేటి వరకు కౌలు వేలం నిర్వహించలేదు. దీంతో మాన్యం భూములు గడ్డి, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి బీళ్లుగా మారాయి. ఆ ఆలయానికి దాదాపు 70 ఎకరాల మాన్యం ఉంది. ప్రతి ఏటా ఉగాది పండుగా కాగానే అధికారులు కౌలు వేలం నిర్వహించేవారు. దీని ద్వారా వచ్చే లక్షలాది రూపాయల ఆదాయంతో స్వామి వారికి ధూప దీప నైవేద్యాలకు కొరత లేకుండా ఉండేది. అయితే, ఈ ఏడాదికి సంబంధించి గత నెల 25న వేలం పాటలు నిర్వహించగా ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరగడంతో అధికారులు వాయిదా వేశారు. మళ్లీ నాటి నుంచి నేటి వరకు అధికారులు వేలం ఊసే ఎత్తలేదు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడం, గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో మాన్యం భూములు బీళ్లుగా మారాయి. దీంతో ఈ సారి ఆలయ ఆదాయానికి గండి పడింది. ఈ విషయంపై ఈఓ నర్సయ్య వివరణ అడగ్గా ఇంకా మాన్యం భూముల వేలానికి తేదీ నిర్ణయించలేదని చెప్పారు.

18 వేల క్యూసెక్కుల నీరు విడుదల

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ఆరు గేట్ల నుంచి 18 వేల క్యూసెక్కులకు నీటి విడుదలను పెంచినట్లు ఏఈ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి విడుదలను పెంచినట్లు తెలిపారు. శ్రీశైలం జలాశయంలో ఆదివారం సాయంత్రం 873.40 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద 872.40 అడుగుల నీటిమట్టం నమోదైనట్లు తెలిపారు. ఆరు గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 18 వేల క్యూసెక్కుల నీటిని ఎస్సార్ఎంసీ కాల్వలోకి విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఈ నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 10 వేల క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ కాల్వకు 5 వేల క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ కాల్వకు 3 వేల క్యూసెక్కులు చొప్పున సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు. సోమవారం జరిగే ఐఏబీ సమావేశంలో తెలుగుగంగ, ఎస్సార్బీసీ, కేసీ ఎస్కేప్ కాల్వలకు ఎన్ని టీఎంసీల నీటిని కేటాయిస్తారు, ఎప్పటి నుంచి ఎప్పటిదాకా సాగు నీటిని విడుదల చేస్తారనే విషయాలపై ఉన్నతాధికారులు సమీక్షిస్తారని చెప్పారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

జూపాడుబంగ్లా/పగిడ్యాల: కర్నూలు-కడప కాల్వకు ఆదివారం సాగునీరు విడుదల చేశారు. తుంగభద్ర డ్యాం నిండటంతో సుంకేసుల జలాశయంలోకి 1,46,746 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. సుంకేసుల డ్యాం లో 1.2టీఎంసీల నీటిని నిల్వచేసుకొని మిగిలిన నీటిని శ్రీశైలం జలాశయంలోకి, కేసీ కాల్వకు 1,500 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ప్రస్తుతం లాకిన్స్‌లా వరకు 700క్యూసెక్కుల సాగునీరు చేరుతుండగా ఈ నీటిని నిప్పులవాగుకు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. నేడు ఐఏబీ సమావేశం ఉన్నందు కేసీ కాల్వకు ఎన్ని టీఎంసీల నీటిని కేటాయిస్తారు, ఎప్పటి నుంచి ఎప్పటిదాకా సాగునీటిని సరఫరా చేస్తారనే విషయాలు వెల్లడవుతాయని ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు.

వీబీఆర్‌కు 16 వేల క్యూసెక్కుల నీరు

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. ఆదివారం బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 16 వేల క్యూసెక్కులు వచ్చి వీబీఆర్‌లోకి చేరినట్లు గంగ ఏఈ శివనాయక్ తెలిపారు. ఈ నెల 27న పోతిరెడ్డిపాడు వద్ద అధికారులు కృష్ణా జలాలు విడుదల చేశారు. దీంతో లింక్ ఛానల్ ద్వారా వీబీఆర్‌కు మొదటి రోజు 8 వేలు, ఆదివారం 16 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహానందిలో సండే సందడి

మహానంది: ఆషాఢమాసం, వరుస వర్షాలతో కొద్ది రోజులుగా మహానందిలో రద్దీ లేక ఆలయ ప్రాంగణాలు వెలవెలబోయాయి. అయితే వర్షాలు తగ్గడంతో పాటు సెలవురోజు కావడంతో ఆదివారం భక్తజనంతో ఆలయం కళకళలాడింది. పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు స్థానిక అలంకార మండపంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఓంకారంలో భక్తులసందడి

బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం పుణ్యక్షేత్రంలో ఆదివారం సెలవురోజు కావడంతో భక్తులరద్దీ కనిపించింది. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ గంగ, ఉమా సమేత ఓంకారసిద్ధేశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, అర్చన పూజలు చేపట్టారు. కొండపై వరకు ఏర్పాటు చేసిన వివిధ విగ్రహ దేవతలతో పాటు శ్రీ వెంకటేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. శ్రీ కాశిరెడ్డినాయన అన్నపూర్ణ ప్రసాద వితరణ కేంద్రం వద్ద భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

విద్యుత్ బిల్లుల వసూళ్లను వేగవంతం చేయండి

గోస్పాడు: విద్యుత్ వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లుల వసూళ్లను వేగవంతం చేయాలని ఏఈ జ్ఞానసూర్యుడు అన్నారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆదివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ఎక్కడా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని సూచించారు. విద్యుత్ బిల్లులు కూడా సకాలంలో వసూలయ్యేలా సిబ్బంది చొరవ చూపాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ బిల్లుల చెల్లింపుపై అవగాహన కల్పించి బిల్లులు త్వరితగతిన చెల్లించేలా చూడాలని తెలిపారు. విద్యుత్ బిల్లులు చెల్లించని వారి విద్యుత్ కనెక్షన్లు తొలగించాలని, ఎక్కడైనా విద్యుత్ మీటరు లేకుండా విద్యుత్‌ను వినియోగిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ ఆనందరావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ తులసిక్రిష్ణ ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని చెప్పారు. మండలంలోని రెవె న్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

పెద్దమ్మా.. ఆశీర్వదించు



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. చీరలు, గాజులు, నిమ్మకాయలు, పిండివంటలు అమ్మవారికి మొక్కుగా చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, శంకరయ్య, చిన్నపెద్దన్న, చిన్నన్నలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుతం టెంకాయలు, ప్రసాదం కొరకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆది, మంగళ వారాల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, అలాగే సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు దర్శన వేలు ఉంటాయన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నంద్యాల(న్యూటౌన్): కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులు, సౌకర్యాలను హరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం కార్పొరేట్ రంగానికి ఉపయోగ పడే విధంగా చట్టాలను మార్పు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే నెరవేర్చాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు.సెప్టెంబర్ 9, 10 తేదీల్లో నందికొట్కూరులో జరిగే జిల్లా స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మజీద్మియ్య పాల్గొన్నారు.

పోరాటాలకు యువత సిద్ధం కావాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు

నంద్యాల(న్యూటౌన్): సమాజంలో మార్పులకు, ప్రజా సమస్యలపై పోరాటాలకు యువత సిద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు రెండో రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రణాళిక, కార్యాచరణ అనే అంశాన్ని బోధించారు. రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతుందని, సమస్య పరిష్కారానికి డీవైఎఫ్ఐ పోరాడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను విస్మరిస్తున్నాయని విమర్శించారు. బడ్జెట్‌లో ఆశలు లేపి నిధులు కేటాయింపులు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాము, రామన్న, ఉపాధ్యక్షుడు రమణ, కార్యదర్శి శివ, జిల్లా అధ్యక్షుడు మధుశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

లోలెవెల్ వంతెనతో ఇబ్బందులు



ఇంజేడు, పెద్దయమ్మనూరు గ్రామాల మధ్య భూమికి సమాంతరంగా ఉన్న వంతెన

ఉయ్యాలవాడ : మండలంలోని భీమునిపాడు, ఆర్.జంబులదిన్నె రహదారిలో ఇంజేడు, పెద్దయమ్మనూరు గ్రామాల మధ్య లోలెవెల్ వంతెన ఉంది. చిన్నపాటి వర్షం వచ్చినా పొలాల్లోని నీరంతా ఈ వంతెన ఎక్కి పారుతుంది. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో నిత్యం ఈ రహదారిలో ద్విచక్రవాహనదారులు, కార్లు, ఆటోలు, పాదచారులు వంతెన దాటాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు నీటి ప్రవాహ వేగానికి మధ్యలోనే నిలిచిపోతున్నాయి. సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని హైలెవెల్ వంతెన నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఆదివారం స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్



సమావేశంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సురేష్ సూచించారు. ఆదివారం స్థానిక అంకాళమ్మ ఆలయ ఆవరణలో స్థానికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఐఈఏ స్థానంలో బీఎన్ఎస్(భారతీయ న్యాయ సంహిత), బీఎన్ఎస్ఎస్(భారతీయ న్యాయ సురక్ష సహిత) బీఎస్ఏ (భారతీయ సాక్ష్య అధినియం) సెక్షన్లను తీసుకొచ్చారన్నారు. అలాగే గతంలో కంటే కఠినంగా చట్టాలను రూపొందించారని, శిక్షాకాలం, ఫైన్ వంటివాటిని పెంచారన్నారు. చిన్నచిన్న విషయాలకు వివాదాలకు పోకుండా కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మౌలాలి, కానిస్టేబుళ్లు సుధాకర్‌రెడ్డి, పీరా, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోస్పాడు: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని గోస్పాడు ఎస్ఐ నాగార్జున రెడ్డి అన్నారు. మండలంలోని జిల్లెల్ల గ్రామంలో ఆదివారం కొత్త చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత చట్టాలు అయిన ఐపీసీ, సీఆర్‌పీసీ, ఐఈఏల స్థానంలో కొత్తగా వచ్చిన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏల గురించి తెలియజేశారు. అంతే కాకుండా మహిళల పై జరిగే నేరాలు వాటికి ఉన్న శిక్షలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయరాదన్నారు. సైబర్ నేరాల గురించి వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.